ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

5★★

జిల్లా వార్తలు

మంగళవారం 2 జూలై 2024

మీ-సేవలో అక్రమాలకు చెక్

- అమలులోకి నగదు రహిత సేవలు
- క్యూ ఆర్ కోడ్ స్కానర్ ద్వారా చెల్లింపులు
- అదనంగా రుసుములు వసూలు చేసే వారిపై నిఘా
- జిల్లాలో సుమారు 172కు పైగా మీ - సేవా కేంద్రాలు



జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మీ సేవ కేంద్రాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టింది. ఈనెల ఒకటవ తేదీ నుంచి మీ సేవా కేంద్రాల్లో నగదు రహిత చెల్లింపుల విధానాన్ని అమలు చేస్తూ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. వినియోగదారులకు సులభంగా, వేగంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో అప్పట్లో ప్రభుత్వం మీ సేవ కేంద్రాల వ్యవస్థను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గతంలో ప్ర భుత్వ కార్యాలయాల్లో ఆయా ధ్రువపత్రాలు, ఇతర అవసరాలకు రైతులు, విద్యార్థులు రాతపూర్వక దరఖాస్తు చేసుకునే వారు. ఇప్పుడంతా ఆ సేవలన్నీ మీ- సేవ కేంద్రాల్లోనే కొనసాగుతున్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో ఆయా సేవలకు సంబంధిత రుసుములను ప్రభుత్వం నిర్ధేశించింది. ఆ రుసుము వివరాలను వినియోగదారులు కనిపించేలా మీ సేవా కేంద్రాల్లో బోర్డులు ప్రదర్శించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మీ సేవా నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుముల కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ చెల్లింపుల విధానాన్ని అమలులోకి తెచ్చింది.

జిల్లా వ్యాప్తంగా 172 మీ సేవ కేంద్రాలు...

జగిత్యాల జిల్లాలో 172 వివిధ మీ సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇందులో ప్రభుత్వ కేంద్రాలు 3, టీజీటీఎస్ కేంద్రాలు 151, టీజీ ఆన్‌లైన్ కేంద్రాలు 18 వరకు ఏర్పాటు చేశారు. టీజీటీఎస్ కేంద్రాలు 168 ఏర్పాటు చేయగా ప్రస్తుతం 151 కేంద్రాలు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. కొందరు మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఇష్టారీతిగా సేవా రుసుములను వసూలు చేస్తున్నట్లుగా పలు సందర్భాల్లో ఆరోపణలు, ఫిర్యాదు వస్తున్నాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపుల విధానాన్ని అమలులోకి తెచ్చింది.

క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా..

మీ-సేవ కేంద్రాల్లో రెవెన్యూ పరమైన సేవలన్నింటికీ నగదు రహిత చెల్లింపులను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఈ నూతన విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఇప్పటికే ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇది సత్ఫలితాలనిస్తుండటంతో ఇక మీదట ప్రైవేటు కేంద్రాల్లోనూ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా రుసుము వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్కానర్లు ఏర్పాటు చేసుకోవాలనే విషయం సంబంధిత మీ-సేవ కేంద్రాల నిర్వాహకులకు తెలిపినట్లు అధికారులు చెబుతున్నారు.

వినియోగదారులకు తీరనున్న ఇక్కట్లు...

మీ సేవ కేంద్రాల్లో రుసుము చార్టుల్లో ఉన్న మొత్తానికి వసూలు చేస్తున్న దానికి పొంతన ఉండటం లేదనే వాదనలున్నాయి. అదనపు వసూళ్లపై ప్రశ్నిస్తే జిల్లాలో అక్కడక్కడ నిర్వాహకులు దురుసుగా వ్యవహరిస్తున్నారని రైతులు, వినియోగదారులు వాపోతున్నారు.

ఇదే విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందినా, తరుచూ అధికారులు తనిఖీలు చేపట్టినా వ్యవహారంలో మార్పు కనిపించడం లేదనేది వాస్తవమని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో అదనపు వసూళ్లకు అడ్డుకట్ట పడే అవకాశం ఉండనుంది. చెల్లింపులు నగదు రహితం కావడంతో ఎంత వసూలు చేశారన్నది ఉన్నతాధికారులకు ఇట్టే తెలిసిపోతుంది. అదనంగా తీసుకునే వారిపై తక్షణ చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.



అన్నింటా అమలుకు ఆదేశాలిచ్చాం

: చేతన్, మీసేవ డిస్ట్రిక్ట్ మేనేజర్

నగదు రహిత చెల్లింపుల విధానం పక్కాగా అమలు చేసేందుకు మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. రెవెన్యూ సేవలేవీ ఉన్నా క్యూఆర్ కోడ్ స్కాన్ విధానంలోనే రుసుము చెల్లించాలి. మీ సేవా కేంద్రాల్లో రుసుమును క్యూ ఆర్ కోడ్ ద్వారానే స్వీకరించాల్సి ఉంటుంది.



పకడ్బందీగా అమలు చేస్తాం

: మమత, మీసేవ ఈడీఎం, జగిత్యాల

మీ సేవా కేంద్రాలలో ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లింపు విధానాన్ని అమలులోకి తీసుకువచ్చాము. పకడ్బందీగా ఈ విధానాన్ని అమలు చేయనున్నాము. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువగా తీసుకునే వారిపై చర్యలు ఉంటాయి. ఈ విధానం ఈనెల ఒకటవ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై వివిధ సమస్యలపై ప్రజల నుంచి 44 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. వ్యయ ప్రయాలకు ఓర్చుకొని పలువురు బాధితులు జిల్లాకేంద్రానికి వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. శాశ్వత పరిష్కార దిశగా జవాబు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రఘువరన్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధు సుదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

●రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చే విద్యార్థులకు కళాశాల సమయానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని కోరుతూ కలెక్టర్‌కు 4వ వార్డు కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ బర్కం మల్లేష్ యాదవ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మండలంలోని ఆలూరు, వీరాపూర్, ధర్మాజీపేట, ఒడ్డెలింగాపూర్, కొత్తపేట, మూటపెల్లి, ఇటిక్యాల మీదుగా రింగ్ బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. ఉదయం 9:30 గంటలకు, సాయంత్రం 4:30 గంటలకు ఈ బస్సును ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

ఎస్పీ అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 1 :ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

●పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు, సామాజిక అంశాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించే విధంగా పోలీస్ కళాబృందం సభ్యులు మరింత చురుకుగా పనిచేయాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పోలీస్ కళాజాత బృందం సభ్యులు సోమవారం ఎస్పీని మార్యద పూర్వకంగా కలిసారు.

●జిల్లాలో జూలై మాసం చివరి వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

విశ్వహిందూ పరిషత్ కమిటీ నియామకం

జగిత్యాల అర్బన్, జూలై 1: విశ్వ హిందూ పరిషత్ జగిత్యాల నగర కార్యదర్శిగా ఎదురుగట్ల పరంధామ్, సహ కార్యదర్శిగా నీలగిరి వికాస్‌రావులకు వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి ఘనపురం రాజేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలను అప్పగించారు. పట్టణంలో జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయం మేరకు నియామకం చేపట్టినట్లు తెలిపారు. వీరితో పాటు సేవా ప్రముఖ్‌గా ఎలుగందుల రాజేంద్రప్రసాద్, మందిర అర్చక పురోహిత విభాగ్ ప్రముఖ్‌గా రాచర్ల హరికృష్ణ, ధర్మాచార్య సంపర్క ప్రముఖ్‌గా అనుపురం శ్రీధర్‌లను నియమించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, విభాగ్ ప్రముఖ్ అల్లె మధు, జిల్లా కార్యదర్శి గజంరాజు, సహ కార్యదర్శి గాజోజు సంతోష్, కోశాధికారి మామిడాల రాములు, నగర అధ్యక్షులు జిట్టవేణి అరుణ్ తదితరులున్నారు.

కల్యాణ లక్ష్మి పేదింటి ఆడపడుచులకు వరం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 1: కల్యాణ లక్ష్మి పేదింటి ఆడపడుచులకు ఒక వరమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 19 మంది లబ్దిదారులకు చెక్కులను సోమవారం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ఆడపచుల వివాహ సమయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల ద్వారా తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. త్వరలో నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను లబ్దిదారుల దరి చేర్చడంలో ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ కోసం తీసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారన్నారు. ధర్మారం ఎస్ఐగా లక్ష్మణ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుమన్, ఆర్ఐ వెంకటేష్, రాజేంద్రప్రసాద్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేములు రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు ఒజ్జల లక్ష్మణ్, సుముఖ్, చీపిరిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.



చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

స్థానిక సంస్థల ఎన్నికల్లో

ఎగిరేది గులాబీ జెండానే

- జగిత్యాల ఎమ్మెల్యే గడ్డిపోచతో సమానం
- సంజయ్‌ది ముమ్మాటికీ రాజకీయ ఆత్మహత్యనే
- కార్యకర్తలు అధైర్యపడొద్దు
- బీఆర్ఎస్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో కేటీఆర్

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి ఎగిరేది గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పద్మనా యక కళ్యాణ మండపంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి కేటీఆర్ ఇటీవల పార్టీలో మారిన జగిత్యాల ఎమ్మె ల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌పై, కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గాలికి కొట్టుకుపోయేవి గడ్డపారలు కాదని, గడ్డిపోచలని జగి త్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అలాంటి గడ్డిపోచతో సంజయ్‌కుమార్ సమానం అన్నారు. ఎంగిలి మోతుకులకు ఆశపడి వెళ్లాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాలలో జరగని అభివద్ధి ఏంటి? జిల్లా కావడమా, మెడికల్ కళాశాల రావడమా? ఎక్కడా లేని విధంగా 4,500 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టడమా లేక సాధించుకున్న వాటిని వెనక్కి పంపడ మా అనేది సంజయ్ ఆలోచన చేసుకోవాలన్నారు. సొంత అభివృద్ధి, నాలుగు రాళ్ల సంపాదన కోసమే పార్టీ మారాడని, రేషం, దమ్ము ఉంటే తక్షణమే ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేసి తిరిగి ఎన్నికలకు వెళ్లి గెలవాలని కేటీఆర్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీలు మారారని, వాళ్లకు రాజకీయంగా సమాధి తప్పదన్నారు. రాహుల్ గాంధీ పార్టీ మారిన వాళ్లను డిస్క్వాలిఫై చేయాలన్నారని, పీసీసీ చీఫ్‌గా ఉన్నపుడు సీఎం రేవంత్ రెడ్డి ఒక పార్టీలో గెలిచి పార్టీ మారకుండా ఇతర పార్టీలోకి వెళ్లే నాయకులను రాళ్లతో కొట్టాలని పిలుపు నిచ్చారని, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలలో గెలిచిన ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంటున్న రేవంత్‌ను రాళ్లతో కొట్టాలా, ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన ఎమ్మెల్యేలను కొట్టాలో రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను ఎందుకు చేర్చుకున్నారంటూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధైర్యంగా ప్రశ్నించి, తన వాదనను ఢిల్లీకి వినిపించారని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఏం ఘోర పరాభవం జరగలేదని స్వల్ప తేడాతోనే అధికారం కోల్పోయామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఏ కూటమిలో లేకుండా స్వతంత్రంగా పోటీచేసిన పార్టీలు అనేకం ఓటమిపాలయ్యాయని అందులో బీఆర్ఎస్ సైతం ఒకటన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని, బీఆర్ఎస్ శ్రేణులు ధైర్యంగా ఉండాలన్నారు. జగిత్యాల ఎమ్మెల్యేది ముమ్మాటికీ రాజకీయ ఆత్మహత్యనేనన్నారు. ఎవ్వరూ భయపడొద్దు, బాధపడొద్దని, రెండు నెలల్లో ఒక్క ఎంపీటీసీ టికెట్ కూడా, బీఫాం కూడా జీవన్‌రెడ్డి, సంజయ్‌కు ఇవ్వనివ్వడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తనతో పాటు తెలంగాణ జాగృతి వ్యవస్థాకురాలు కవితక్క జగిత్యాలకు వచ్చి గల్లీ గల్లీ పర్యటించి గెలుపునకు కృషి చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్



హాజరైన కార్యకర్తలు

●నమ్ముకున్నోళ్ల నోట్లో మట్టికొట్టాడు...

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

జగిత్యాల జిల్లాలో రెండు సీట్లు బీఆర్ఎస్ గెలిస్తే, జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభివృద్ధి ముసుగులో డబ్బుల కోసం పార్టీ మారి, నమ్మినోళ్లు, నమ్ముకున్నోళ్ల నోట్లే మట్టికొట్టాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి ఏంటో ఆత్మపరిశీలన చేసుకోవా లన్నారు. తన కడుపు నింపుకోవడం కోసం, కాంట్రాక్ట్ పనుల కోసమే పార్టీ మారారని విమర్శించారు.

●బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

దేశంలో అద్భుతంగా అభివృద్ధి జరిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణగా బీఆర్ఎస్ పాలన హయాంలో గుర్తింపు పొందిదని, చరిత్రను తుడిచేయడం ఎవరికీ సాధ్యం కాదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించి, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్‌కు లేదన్నారు. కేసీఆర్ మార్క్ లేకుండా ఏ రంగం తెలంగాణలో లేదన్నారు.

●బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యం..

జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

బీఆర్ఎస్ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తమకు ధైర్యం చెప్తున్నట్లుగా ఉందని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. పార్టీ అనేది మహావృక్షం అని, ఎవరూ పోయిన ఉన్నా పార్టీకి వచ్చే నష్టమేమి లేదని, బీఆర్ఎస్ పార్టీ ఊట చెలిమె అన్నారు. జీరో నుంచి వంద సీట్లకు పార్టీ పెరిగిందని, తాత్కాలికంగా ఇబ్బంది అయిన మళ్లీ అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే డాక్టర్ సంజయ్‌కుమార్ పార్టీ మారారని, అనేక ఇబ్బందులకు గురిచేసిన పార్టీ మారకుండా గుండెలో బాధను దిగమింగుకొని పార్టీకోసం నిలబడ్డానన్నారు.

●పార్టీ మారి మోసం చేశాడు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

ప్రేమా, అభిమానంతో కార్యకర్తలు పార్టీ భుజాన ఎత్తుకొని గెలిపిస్తే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మోసం చేసి పార్టీ మారారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. కవిత ఎంపీగా ఉన్న సమయంలో జగిత్యాలలో సంజయ్‌ను గెలిపించుకోవడానికి కోరుట్లలో ఆగకుండా జగిత్యాలకే వస్తుం డేదని, సంజయ్ గెలుపునకు ప్రధాన పాత్ర కవి తదే అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసమే తాను నిలబడ్డానని అవసర మైతే కోరుట్ల నుంచి జగిత్యాలకు వచ్చి కడుపులో పెట్టుకొని కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు.

పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రమణ

తనకు ఇచ్చిన గౌరవానికి రుణం తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతోనే టీడీపీ వీడి బీఆర్ఎస్‌లోకి చేరి, తనతో పాటు కార్యకర్తల రక్తాన్ని చెమటచుక్కలుగా చేసి, సంజయ్ గెలుపునకు కృషి చేశామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సూచించినట్లుగా మెరికల్లాంటి కార్యకర్తలను బీఆర్ఎస్ పార్టీకి తయారు చేస్తామన్నారు. పార్టీని అధికారం లోకి తీసుకుపోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. స్టేట్ ఫైనాన్స్ చైర్మెన్ గోడిసెల రాజేశం మాట్లాడుతూ ఆరు నెలలు గడిచిన కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు కనిపించడం లేదన్నారు.

ఎన్టీఆర్ తర్వాత అంతటి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. డాక్టర్ సంజయ్ పార్టీ మారే విషయాన్నే స్వగ్రామానికి చెందిన సహచరున్ని తనరే చెప్పలేదన్నారు. పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ పార్టీ నుంచి వెళ్లిన వారికి భవిష్యత్ లేదని, సోషల్ మీడియాలో జరిగే ప్రచారాలపై కాస్త ఆలోచన చేయాలన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సమానం అన్నారు. సంజయ్ పార్టీ వీడడం దురదృష్టకరం అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, వేములవాడ ఇన్‌చార్జి చెల్మెడ లక్ష్మీనర్సింహారావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్, సీనియర్ నాయకులు వోరుగంటి రమణారావు, జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సభ్యుడు ముప్పాల రాంచందర్‌రావు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

ప్యాంట్ మేకర్స్ కావలెను

జగిత్యాలలోని అతిపెద్ద మెగా సిటిమెన్ టేలర్‌లో ప్యాంట్లు కుట్టడానికి నైపుణ్యంగల ప్యాంటు మేకర్లు కావలెను. సంప్రదించండి: 98493 46271

AJK-197060

LAND FOR SALE

★ చెంజర్లమేన్ రోడ్ నుండి డాంబర్ రోడ్‌కి మూడు కిలోమీటర్ల దూరంలో 1ఎ., 2ఎ., 3ఎ, 4ఎ, లేదా ఐదు ఎకరాలు కమర్షియల్ లేదా అగ్రికల్చర్‌కు ఉపయోగపడే భూమి అమ్మకానికి కలదు. సెల్: 63023 36709

AJK-197063

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 99854 10640

జగిత్యాల :- సెల్ : 99854 11262

మెట్‌పల్లి :- సెల్ : 70131 42966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238



UNANIMOUS EPIC BLOCKBUSTER
నేడే చూడండి



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 - కాచిగూడ 10.45,2.15,5.45,9.15
దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ (3D తెలుగు) 8.00,11.40,3.20,7.00,10.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
మల్లిఖార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
భ్రమరాంబ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
తెలుగు 2D
తెలుగు 3D
హిందీ 3D

GLOBAL CINEMAS RELEASE

UNANIMOUS EPIC BLOCKBUSTER
నేడే చూడండి



వరంగల్
ఖమ్మం
కరీంనగర్
నిజామాబాద్
ఆదిలాబాద్
మహబూబ్‌నగర్
మెదక్
రంగారెడ్డి
నల్గొండ
రాయచూర్
(FULLY RENOVATED)

ఈనెల 5న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
మెగా 70 ఎంఎం ఎ/సి- దిల్‌సుఖ్ నగర్
సంపూర్ణ 70 ఎంఎం - వనస్థలిపురం
రంగ 70 ఎంఎం ఎ/సి - జీడిమెట్ల
SKML MOTION PICTURES THROUGH GANESH BHARI 9296509333/9299921737

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 2వ వారం



రుక్మిణి 70ఎంఎం - సంగారెడ్డి
11.00,2.00,6.00,9.00
వెంకటరమణ 70ఎంఎం - జడ్చర్ల
PARAM JYOTHI FILMS 9848028739

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎఫ్‌బీ కార్యకర్తలు

సుభాష్‌నగర్, జూలై 1: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని చెబుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని, ఈ విషయమై అధికారులకు విన్నవించుకున్నా ఎలాంటి ఫలితం లేదన్నారు. తక్షణమే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురువెల్లి శంకర్, ప్రశాంత్ కుమార్, బేక్కంటి రమేశ్, బద్రి, కార్మిక సంఘ నాయకులు అరుణ్, కళావతి, శారద, సరళ పాల్గొన్నారు.

నకిలీ ఏజెంట్లపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 1: ముగ్గురు నకిలీ ఏజెంట్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన మొగిలి దేవదాస్ అతని స్నేహితుడైన కల్లెడ శ్రీకాంత్, చెర్లకొండపూర్ గ్రామానికి చెందిన అడప రాజేష్ ఉపాధి నిమిత్తం వేరే దేశం వెళ్లేందుకు కరీంనగర్ పట్టణానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ఇండో అరబ్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలీ, విలాసాగర్ తిరుపతి, రహీంలను కలిశారు. సదరు వ్యక్తులు వీసా ఇప్పిస్తానని నమ్మబలికి యూరప్ దేశం లిథువేనియా పంపిస్తానని వారి వద్ద నుంచి పది లక్షల ఇరవై వేల రూపాయలు వసూలు చేసి నకిలీ వీసాలు ఇచ్చారు. ఎయిర్ పోర్టుకు వెళ్లిన బాధితులకు అక్కడ అధికారులు అవి నకిలీ వీసాలు అని తేల్చి చెప్పడంతో ఏజెంట్లు తమను మోసం చేశారని న్యాయం చేసి తమ డబ్బులు ఇప్పించాలని కోరుతూ మొగిలి దేవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహమ్మద్ అలీ, విలాసాగర్ తిరుపతి, రహీంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు-

జగిత్యాల టౌన్, జూలై 1: జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సుబ్రహ్మణ్యా స్వామి త్రికూటాలయంలో 9వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యా స్వామి వారల కల్యాణ మహోత్సవ వేడులకను వేద పండితులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై కల్యాణ వేడుకలను నిర్వహించగా మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతితో పాటు భక్తులు హాజరై ఒడి బియ్యం సమర్పించి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సుబ్రహ్మణ్యా స్వామి ఆలయ ట్రస్టు సభ్యులు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దు

కరీంనగర్ టౌన్, జూలై1: ఆర్థికంగా ఎదిగిన ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏ జాబితాలో చేర్చవద్దని తెలంగాణ రజక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రజక సంఘం ఆధ్వర్యంలో బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి జిల్లా సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా రజక సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ 2008లో బీసీ ఏలో చేర్చవద్దని కోరుతూ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు తప్పుబట్టడంతో ముదిరాజ్‌లు సుప్రీం కోర్టును ఆశ్రయించారని అన్నారు. సుప్రీం కోర్టు కూడా తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ముత్యాల నర్సింహులు, వనపర్తి శంకర్, చాకలి అయిలమ్మ మనుమరాలు శ్వేత, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, కెవిఎల్ సుధాకర్, పైడి కొమురయ్య, వాల్మీకి ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎన్.గోపాల్, లీగల్ అడ్వయిజర్ లింగంపల్లి నాగరాజు, నెమలి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన విశ్వవిద్యాలయంలో వన మహోత్సవం



ఎస్‌యూలో మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్

గణేశ్‌నగర్, జూలై 1: శాతవాహన విశ్వవిద్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఎన్.రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బిఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ బి.ఎన్.రావు పాల్గొన్నారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మనోహర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ పాల్గొని విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. అలాగే అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా బీయన్‌రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కంచు తిరుపతి, అధ్యాపకులు డాక్టర్ మనోజ్ కుమార్, బండ నరేష్, డాక్టర్ బి పరుశురాములు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 1: కరీంనగర్ బస్టాండ్ కాంప్లెక్స్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. రాత్రి 11 గంటల సమయంలో బ్యాంక్‌లో నుంచి దట్టమైన పొగలు బయటకు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తన సిబ్బంది, ఫైర్ ఇంజన్‌తో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు అదుపులోకి రాలేదు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.


బ్యాంకు షట్టర్లు తెరుస్తున్న పోలీసులు

సంక్షేమ హాస్టళ్లలో సీట్ల సంఖ్య పెంచాలి

గణేశ్‌నగర్, జూలై 1: జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లలో సీట్ల సంఖ్యను పెంచాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నంద గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ హాస్టళ్లలో సరిపడా సీట్లు లేనందున అనేక మంది విద్యార్థులు ఇంటర్, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా యంత్రాంగం స్పందించి విద్యార్థులకు సరిపడా భవనాలను ఏర్పాటు చేసి సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను కలుపుకొని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కుమార్, తిరుపతి, మహేష్, గణేష్, నరేష్, నాతోపాటు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాటర్‌పోలో పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 1: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈనెల 7నుంచి 11వ తేది వరకు జరిగే 50వ జూనియర్ జాతీయ స్థాయి వాటర్‌పోలో పోటీలకు జిల్లాకు చెందిన ఇరువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 23న సికింద్రాబాద్‌లో జరిగిన 9వ తెలంగాణ సబ్‌జూనియర్ అంతర్ జిల్లాలో స్విమ్మింగ్ పోటీల్లో విశేషప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు కంకణాల శ్రీధర్, హాశిక పటేల్‌లు విశేష ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్విమ్మింగ్ కోచ్ పి చంద్రశేఖర్ తెలిపారు. గతంలో కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయపోటీల్లో శ్రీధర్ పాల్గొని ప్రతిభ చాటాడని పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన శాఖ అధికారులు వి.శ్రీకాంత్ రెడ్డి, స్విమ్మింగ్ కోచ్ సంపత్‌కుమార్ తదితరులు అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో

కుటుంబ కలహాలతో బాలిక ఆత్మహత్యాయత్నం

చందుర్తి, జూలై 1: కుటుంబ కలహాలతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీవాణి (15) 9వ తరగతి చదువుతున్న బాలిక కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం మొదట వేములవాడలోని ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం బాలిక తండ్రి లచ్చయ్య మృతి చెందాడు. సంఘటనపై విచారణ జరుగుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

ఎస్సారెస్పీకి పెరగనున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రంలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. సోమవారం బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో గోదావరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేది నుంచి ఎత్తి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు ప్రాజెక్టు గేట్లు తెరుచుకొని ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరనుంది. అక్టోబర్ 28వ తేది వరకు గేట్లను ఎత్తి ఉంచనున్నారు. బాబ్లీ గేట్లు తెరుచుకునే పనులను పరిశీలించడానికి ఎస్సారెస్పీ అధికారుల బృందం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించింది. అధికారుల బృందంలో సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్ర పాణి, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సతీష్, నాందేడ్ బాబ్లీ ఈఈ బాన్సోడ్, పోచంపాడ్ ఏఈఈ వంశీ, పలువురు బాబ్లీ డ్యామ్, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు అధికారులు తదితరులున్నారు.


ప్రాజెక్టును సందర్శించిన ఎస్సారెస్పీ అధికారులు


బాబ్లీ గేట్లు ఎత్తడంతో ఎస్సారెస్పీలోకి వస్తున్న వరద నీరు

స్కూల్‌కు వెళ్లేందుకు ఎలక్ట్రిక్ బైక్ ఇవ్వలేదని.. పురుగుల మందు తాగిన విద్యార్థి

చికిత్స పొందుతూ మృతి

కథలాపూర్, జూలై 14 : తాను ఎలక్ట్రిక్ బైక్‌పై స్కూల్ వెళ్తానని అడగడంతో తల్లి మందలించగా గడ్డి మందు తాగిన విద్యార్థి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన మండలంలోని పోసాని పేటలో జరిగింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... మారు మణిదీప్ (14) ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదవుతున్నాడు. ప్రతీ రోజూ సైకిల్‌పై వెళ్లే మణిదీప్ గత నెల 26న ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ బైక్‌పై వెళ్తానని తల్లిని అడగగా అందుకు తల్లి నిరాకరించింది. దీంతో మనస్థాపానికి గురైన మణిదీప్ గడ్డి మందు తాగాడు. దీంతో కడుపు నొప్పిగా ఉందని ఇంట్లో వారికి చెప్పడంతో పరిస్థితి గమనించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ సోమవారం మణిదీప్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


మణిదీప్ (ఫైల్)

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, జూలై 1: చొప్పదండి పట్టణంలో చోరీ జరిగింది. గుర్రం చంద్రకళ తన ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. సోమవారం వచ్చి చూసే సరికి ఇంటిలోని బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులోని పద్నాలుగు తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదుతో పాటు ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

రోడ్డు పక్కన షాపులు తొలగించిన సిబ్బంది

నిరసన తెలిపిన షాపుల నిర్వాహకులు


శంకరపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న షాపుల నిర్వాహకులు

శంకరపట్నం, జూలై 1: మండలంలోని తాడికల్‌లో రోడ్డు అక్రమించి ఉన్న షాపులను గ్రామపంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా తాడికల్‌లో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి స్థలంలో చిరు వ్యాపా రులు షాపులు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. రోడ్డును అనుకుని షాపులు ఏర్పాటు చేసుకోవడంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వాహకులను పలుమార్లు హెచ్చరించినా షాపులు తొలగించలేదు. సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది రహదారి స్థలంలో ఉన్న షాపులను తొలగించారు. దీంతో షాపు నిర్వాహకులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి సమ రాజేశ్వర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, జూలై 1: బీసీ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు కోరారు. గతంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టులను బీసీ సంక్షేమ అధికారుల ద్వారా భర్తీ చేశారన్నారు. ఇప్పుడు కూడా అలాగే చేసి ప్రత్యేక బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీ కార్పొరేషన్‌ను యథావిధిగా కొనసాగించాలన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లి టౌన్, జూలై 1: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘనటన సోమవారం పెద్దపల్లిలో జరిగింది. ముత్తారం మండల కేంద్రానికి చెందిన ఆకుల మొగిలి (45) కొద్ది రోజులుగా మద్యం సేవిస్తూ ఇంట్లో తరుచు గొడవకు దిగేవాడు. ఇదే క్రమంలో మద్యం మత్తులో ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మొగిళి తన సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. సోమవారం కూనారం రైల్వేగేటు వద్ద తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు మొగిళి భార్య ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.


మొగిలి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్ , జూలై 1 : మండలంలోని కొత్తపల్లి నుంచి పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య చీకురాయి రైల్వే పట్టాలపై గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి. తిరుపతి తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పాటు బ్లూ కలర్ షర్టు, నలుపు రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఏమైనా వివరాలు తెలిస్తే 9949304574, 8712658604 నంబర్‌కి కాల్ చేయాలని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 1: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. చందనాపూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఎస్సై సనత్‌కుమార్ సిబ్బందితో కలసి తనిఖీ చేయగా ఓ ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,410 స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులపై ఎస్సై సనత్‌కుమార్ కేసు నమోదు చేశారు.

విద్యుత్ ప్రజావాణిలో సమస్యలు తక్షణమే పరిష్కారం

గణేశ్‌నగర్, జూలై 1: విద్యుత్ ప్రజావాణిలో వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. విద్యుత్తు వినియోగదారుల కోసం టీజీఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఆయన వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ విద్యుత్తు ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఆఫీసు 3 దరఖాస్తులు, కరీంనగర్ టౌన్ 5 , కరీంనగర్ రూరల్ 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ విజయేందర్ రెడ్డి, ఏడీ స్వప్న, వీణ, తదితరులు పాల్గొన్నారు.

కోడెలు, ఆవులను ఉచితంగా పంపిణీ చేయాలి

● రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ● వేములవాడ గోవుల ఉచిత పంపిణీపై సమీక్ష


మాట్లాడుతున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ గోశాల నుంచి అదనపు కోడెలు, ఆవులు, ఉచిత పంపిణీకి అర్హు లైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నా రు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వేములవాడ దేవస్థానం గోవుల ఉచిత పంపిణీపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవస్థానానికి భక్తులు సమర్పించిన కోడెలు, ఆవులు అధికంగా పెరగ డం వల్ల అసక్తి గల అర్హులైన రైతులు ఆలయ గోశాలలు, ప్రైవేటు గోశాలలు, హిందూ మతాల వారికి అదనపు కోడెలు, అవులను ఉచితంగా పంపిణీ చేయడానికి దరఖాస్తులు అహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు రాని పక్షంలో రైతు సంఘాలు, సొసైటీలకు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. వేములవాడ దేవస్థానం ఈవోకు దరఖాస్తు చేసుకోవాల ని అన్నారు. వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వంచే ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

వేములవాడ దేవస్థానానికి సంవత్సరానికి 2,500 కోడెలు భక్తులు సమర్పిస్తారని దేవాలయం వద్ద 450 నుంచి 500 వరకు కోడెలు నిల్వ ఉంచుకుని మిగిలినవి వివిధ గోశాలకు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. తిప్పాపురం గోశాలతో అదనపు షెడ్ల నిర్మాణం, సీసీ ఫ్లోరింగ్, డ్రైనేజీ నిర్మాణం, కోసం దేవాదాయ శాఖ రూ కోటి మంజూరు చేసిందని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అన్నారు. గోశాల నుంచి కోడెలు, ఆవులు పంపిణీ చేసిన తరువాత నిర్వహణ పకడ్బందీగా ఉండాలని జిల్లాలో అధికారులు అకస్మికంగా తనిఖీలు చేస్తారని తెలిపారు. పంపిణీ చేసే ప్రతి కోడె, అవులకు వైద్య పరీక్షలు నిర్వహించి అరోగ్య రిపోర్టులు లబ్ధిదారుడికి, దేవస్థానం, పశు సంవర్ధక శాఖ వద్ద ఉండాలని అన్నారు. పంపిణీ చేసిన పశువులను కూడా పశు సంవర్ధక శాఖ వైద్యులు పరిశీలించడం జరుగు తుందని కోడెలు, అవుల పట్ల నిర్లక్ష్యం వహించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో రాజేశ్వర్, ఈవో వినోద్‌రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కోమురయ్య ఉన్నారు.

యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జూలై 1: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు ఆలయంలో సోమవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమ సూక్త పూర్వక అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అపమృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కరీంనగర్ క్రై, జూలై 1: మానకొండూర్ సమీపంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌లు కొత్తగా అమల్లో వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ప్రకారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన శివరాత్రి కొమురయ్య తన ట్రాక్టర్ ద్వారా మానేరు వాగు నుంచి కరీంనగర్‌లోని ముకరంపురకు తరలిస్తున్న క్రమంలో టూ టౌన్ పోలీస్‌లు తెలంగాణ చౌక్ వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కొత్త చట్టం బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. కొత్త చట్టం ప్రకారం కమిషనరేట్ వ్యాప్తంగా సోమవారం పదికిపైగా కేసులు నమోదయినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

స్కానింగ్ సెంటర్లలో దోపిడీని అరికట్టాలి

సుభాష్‌నగర్, జూలై 1: జిల్లా కేంద్రంలోన ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు వసూలు చేస్తున్న అధిక ఫీజులను తగ్గించి దోపిడీని అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లిఅ యుగేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆర్ఎంపీ, పీఎంపీలతో పేరుతో పేషంట్ల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన వసతులు, పార్కింగ్ స్థలం, మంచినీటి సౌకర్యం, విశాలమైన గదులు వంటి సౌకర్యాలు కల్పించకుండా అధిక ఫీసులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

లోవోల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం

మల్యాల, జూలై 1: మల్యాల బీసీ కాలనీలో ఆదివారం రాత్రి లోవోల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం అయ్యాయి. కాలనీకి చెందిన పలువురి ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, విద్యుత్ లైట్లు తదితరవి కాలిపోయాయి. లోవోల్టేజీ సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు.

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


కుంకమ పూజలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి, జూలై, 1: పట్టణంలోని బంగారు పెద్దమ్మ తల్లి ఆలయం 14వ వార్షికోత్సలు ఘనంగా జరిగాయి. సోమవారం బంగారు పెద్దమ్మతల్లి ఆభరణాలను వీధుల గుండా ఎదుర్కోలుగా ఆలయానికి కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు భక్తులతో కలిసి నెత్తిన ఎత్తుకొని తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలోని అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తు లకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం లో హోమం, కుంకుమ పూజలు జరిపించారు. అనంతరం భక్తులు ఆలయ సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయవలన వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సార్గం వాడకట్టు సంఘం అధ్యక్షుడు జక్కం బాబు, మఠంవాడ సంఘం అధ్యక్షుడు యామ గణేష్, జక్కం రమేష్, పోచమ్మవాడ సంఘం అధ్యక్షుడు నేమూరి బాలకృష్ణ, జిట్టవేణి నర్సయ్య, రంజిత్, లక్ష్మయ్య, రాజయ్య, సంఘం సభ్యులు, నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్, జూలై 1: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏడు వేల కోట్లకుపైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరి మామిడిపల్లి హెమంత్, కసిరెడ్డి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

సుభాష్‌నగర్, జూలై 1: కురుమ కులస్తులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కురుమ సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలు కర్రె పావని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కురుమలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గం నుంచి బీర్ల ఐలయ్య ఎమ్మెల్యేగా గెలిచారని అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కురుమ జనాబాకు ప్రతినిధిగా ఉన్న బీర్ల ఐలయ్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు పెద్ది అనిత, పుల్ల రమ్య, సంద అంజలి, మేకల దేవిక, కర్రె సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను కూల్చేందుకు అధికారుల యత్నం

అడ్డుకున్న నిర్మాణదారులు

కరీంనగర్ రూరల్, జూలై1: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో సర్వేనెంబర్ 471 పోచమ్మకుంట గుట్ట ప్రాంతం లో అక్రమ కట్టడాలను కూల్చేం దుకు ఆదివారం రెవెన్యూ అధికారు లు యత్నించగా ఇద్దరు అడ్డుకున్నా రు. కొన్నేళ్లుగా ప్రభుత్వ స్థలంలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ సర్వే నెంబర్‌లో వేముండ్ల వెంక టేష్ ఇటీవల ప్రహరీ నిర్మిస్తుండగా గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల కిందట ప్రహరీ కూల్చేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను వారు అడ్డుకున్నారు. సోమవారం ఆర్ఐ రజినీ కాంత్ మోకాపై వెళ్లి పరిశీలించారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీని ఎక్స్‌కావేటర్‌తో కూల్చి వేసేందుకు ప్రయత్నించగా వెంకటేష్ పురుగుల మందు డబ్బాతో వచ్చి అడ్డుకున్నాడు.

అలాగే మరో వ్యక్తి దుస్స అంజనేయులు ఎక్స్‌కావేటర్‌ని అడ్డగించి తమ ఇళ్లను కూల్చవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ స్థలంలోనే 20 నుంచి 30 సంవత్సరాలుగా ఆధీనంలో ఉంచుకున్నామని, గొర్రెల మందలను ఏర్పాటు చేసుకున్నామని వెంకటేష్ తెలిపాడు. కొందరు ఇళ్ల నిర్మాణం చేసుకున్నారని వాటికి కరెంటు మీటర్లు, నల్లలు ఏర్పాటు చేసి నప్పటికి గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఓ ప్రజాప్రతినిధి అండతో అక్రమ నిర్మాణాలు జరిపితే పట్టించుకోలేని అధికారులు తమ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేయడమేంటని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని తొలగించి తను నిర్మించిన ప్రహరీని కూల్చాలంటూ పురుగులమందు డబ్బాతో ఒకరు, జేసీబీని అడ్డుకుని మరొకరు వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. చివరకు ప్రహరీ కూల్చివేత కార్యక్రమాన్ని నిలిపివేశారు. స్వచ్ఛందంగా ప్రహరీ తొలగించకుంటే వెంకటేష్‌పై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రజనీ కాంత్ హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు జరిపితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.


పనులను అడ్డుకొని నిరసన తెలుపుతున్న దుస్స ఆంజనేయులు

మద్దతు పలికిన బీజేపీ మండల అధ్యక్షుడు

అక్రమ నిర్మాణాల తొలగింపు విషయంలో బీజేపీ మండల అధ్యక్షుడు అభ్యంతరం వ్యక్తం చేశాడు. గుట్టకు అనుకుని ఉన్న భూములు బండరాళ్లతో నిరుపయోగంగా ఉండేదని ఇల్లులేని పేదలు కొందరు భూమిని చదను చేసుకున్నారని, మరి కొందరు పశువులకు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా కబ్జాలో ఉన్న వారికి పట్టాలు, నివేశస్థలాలకు ప్రొసీడింగ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలోనే వారు 58,59జీవో దరఖాస్తు చేసుకున్నారన్నారు. తహసీల్దార్ వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 1: ప్రవర్తన సరిగా లేదని మార్చుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కరీంపేటకు చెందిన గుర్రం సాయిరాం (21) ప్రవర్తన బాగోలేదని, మార్చుకోవాలని తల్లిదండ్రులు గుర్రం భాగ్యలక్ష్మి- నాగరాజు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సాయిరాం సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. సాయిరాం తండ్రి గుర్రం నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.


సాయిరాం (ఫైల్)

వేములవాడలో ఒకరి ఆత్మహత్య

వేములవాడ టౌన్, జూలై 1: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ పరిసరాల్లో సోమవారం ఓ వ్యక్తి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన గూడూరి విష్ణు (36) అనే వ్యక్తి రాజన్న ఆలయ పరిసరాల్లో స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు గతంలో నేత కార్మికుడగా, ఆటో డ్రైవర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగానే వుంటున్నాడని తెలిపారు. భార్యతో విడాకులు చేసుకుని ఒంటరి జీవితాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.


గూడూరి విష్ణు (ఫైల్)

రంగపేట పాఠశాలలో చోరీ

సారంగాపూర్, జూలై, 1 : మండలంలోని రంగపేట జడ్పీహెచ్ పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. హైస్కూల్, ప్రైమరీ, అంగన్‌వాడీ సెంటర్ ఒకే చోట నిర్వహించబడుతాయి. ఆదివారం రాత్రి దుండగులు చొరబడి అంగన్‌వాడీ సెంటర్ తలుపులు పగులగొట్టి కోడిగుడ్లను ధ్వంసం చేపడంతో పాటు, పాఠశాలలో ఉన్న హైమాస్ట్ లైట్లను ఎత్తుకెళ్లారు. స్థానికులు, ఉపాధ్యాయుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

డీఈవో, ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఏబీవీపీ వినతి

జగిత్యాల అర్బన్, జూలై 1: ఇష్టానుసారంగా నిర్వహణ సాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు, ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చి పోషకులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారీతిన పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నా, విద్యార్థులకు కుళ్లిన ఆహార పదార్థాలతో భోజనం పెట్టిన జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జిల్లాలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఈవో, ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మనువాడ నందు, రాజు, భాను, విష్ణు లున్నారు.

ప్రీస్కూల్ తరగతుల నిర్వహణపై శిక్షణ

మల్యాల, జూలై 1: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ తరగతుల నిర్వహణలో భాగంగా నూతన సిలబస్ విద్యార్థులకు అందించడానికి గాను అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించే మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం మల్యాలలో ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు ఎంపీపీ ఆగంతపు రవళి శిక్షణ తరగతులను ప్రారంభించగా అంగన్‌వాడీ టీచర్లకు థియరి, ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సులభంగా బోధించే అవకాశం ఉంటుందని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మల్యాల, పెగడపల్లి, కొడిమ్యాల, గొల్లపల్లి మండలాలకు చెందిన 200 మంది అంగన్‌వాడీ టీచర్లుకు శిక్షణ ఇస్తుండగా సీడీపీవో నర్సింగరాణీ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అంతకు ముందు నూతన పాఠ్యపుస్తకాలను ప్రజాప్రతినిధులతో కలిసి విడుదల చేశారు.

'పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'

జగిత్యాల అర్బన్, జూలై 1: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా కమిటీ బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ పిలుపుమేరకు సోమవారం జిల్లా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తమ నిరసనను తెలియజేశారు. సంఘ బాధ్యులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున ప్రభుత్వం సత్వరమే నిధులు విడుదల చేసి విద్యార్థులకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అక్రమాలిక్, సమీర్, నితిన్, సోహెల్, శివసాయి, రాహుల్, నాగరాజు, అశ్వక్ తదితరులున్నారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆరోగ్యం బాగుందా.. కృష్ణా

బీఆర్ఎస్ నాయకుడికి ఫోన్ చేసి పలకరించిన కేటీఆర్

కొడిమ్యాల, జూలై 1 : ఆరోగ్యం బాగుందా కృష్ణా..వారంలో మళ్లీ వస్తా.. నీ ఆరోగ్యం జాగ్రత్త అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొడిమ్యాల మండలంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావుకు సోమవారం ఫోన్ చేసి ఆత్మీయంగా పలకరించాడు. జగిత్యాలలో సమావేశం ముగించుకొని వెళుతుండగా కొడిమ్యాల జడ్పీటీసీ ప్రశాంతికి ఫోన్ చేసి కృష్ణారావు ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణారావుతో నీ ఆరోగ్యం బాగుండేలా చేసుకోవాలని సూచించారు. మళ్లీ కలుద్దాం అన్నారు. ప్రస్తుతం కొంత ఆరోగ్యంగా ఉన్నానని కృష్ణారావు తెలిపారు.

జగిత్యాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ శివారులోని నూకపల్లి వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విద్యుత్ పనుల కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం హైద్రాబాద్‌లో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వినతి పత్రం అందించారు. జగిత్యాల పట్టణానికి చెందిన పేద ప్రజల కోసం నూకపల్లి వద్ద 4,520 ఇండ్లలో అర్బన్ హౌజింగ్ కాలనీ నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇంత వరకు 3,720 ఇండ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించామన్నారు. ఇంత పెద్ద కాలనీలో లబ్ధిదారులకు సౌకర్యం కల్పించుటకు ప్రస్తుతం అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

●రాష్ట్ర ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సచివాలయంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కలిశారు. జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా కోరారు.

'మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ దళితులకు కేటాయించాలి'

మెట్‌పల్లి, జూలై, 1 : మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని దళితు లకు కేటాయించాలని మాల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీల్లో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి అధికారంలోకి రావడానికి, జరిగిన ప్రతి ఎన్నికల్లో ఇంద్ర నగర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వెంటా ఉన్నామన్నారు. అధికారంలో ఉన్న లేకున్న 40 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లోనే ఉంటూ పార్టీ బలోపేతం చేయడానికి ఇంద్రనగర్ మాల సంఘం కృషి చేసిందన్నారు. కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చొరవ తీసుకోని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని ఇంద్ర నగర్ ప్రజలకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయ కులు పొట్ట రాజేశ్వర్, దయ్యా నందయ్య, సోమిడి రాజయ్య, మెట్‌పల్లి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోమిడి శివ కుమార్, గోరుమంతుల మారుతీ, పొట్ట ప్రేమ్, కోల ప్రశాంత్, నేరెళ్ల నరేష్ అమ్ముల పవన్, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారం అందుకున్న చెప్యాల వాసి

కొడిమ్యాల, జూలై 1 : మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన గుగ్గిళ్ల నాగభూషణాచారి ఆదివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ ప్రతినిధులతో మహానంది జాతీయ గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. నాగభూష ణాచారి తాను చేస్తున్న రచనలతో సాహితీ రంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారాన్ని, నంది అవార్డును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజుకుమార్, విశ్వకళా విరాట్‌బ్రహ్మ డా.. వంగల శాంతికృష్ణ ఆచార్య, హాస్య నటుడు ఎస్.ఆర్. నంద పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

రాయికల్, జూలై 1: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మైదానంలో నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. పిల్లల తల్లిదండ్రులకు, అధికారులకు, గ్రామ పెద్దలు తెలిపినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులే చేయి చేయి కలిపి సోమవారం తమ మైదానాన్ని తామే చదును చేశారు. పద్మశ్రీ దశరథ మహాజీ నిఆదర్శంగా తీసుకుని ఎవరో ఏదో చేస్తారని ఆలోచించకుండా ఎలాగైనా నీటి కుంటలను నింపాలనే ఆలోచనతో విద్యార్థులు వారి సొంత ఆలోచనతో ప్రతి రోజు ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లే సమయంలో గత కొద్ది రోజుల నుంచి ఒక చిన్న సంచిలో మట్టిని తీసుకువెళ్తున్నారు. దీనిని గమనించిన 2004-05 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు వారి ఆలోచనకు మెచ్చుకుని వారివంతుగా పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలను పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందించారు. వీరిని పలువరు అభినందిస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల, జూలై 1 : స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆధ్వర్యంలో 'సఫాయి అప్నావో బిమారీ భగావో' నినాదం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జూలై 1వ తేదీ నుం చి అగస్టు 31 వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి నిరంతరం పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీటి నాణ్యతపై దృష్టి సారించాలని సూచిం చారు. జూనియర్ అకౌంటెంట్ శివకుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, ఎన్విరా న్మెంటల్ ఇంజనీర్ మహేష్ పాల్గొన్నారు.

వైద్యుల పరిరక్షణ బాధ్యత ప్రజలదే

●ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములు

●జిల్లా కేంద్రంలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

జగిత్యాల టౌన్, జూలై 1 : వైద్యుల పరిరక్షణ బాధ్యత ప్రజలదేనని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మాత శిశువు ఆసుపత్రిలో సోమవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేసన్ జగిత్యాల జిల్లా, ఆర్ఎంపీ, పీఎంపీ శాఖల ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందిస్తున్న వైద్యులను శాలువాలతో సన్మానించారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ వైద్యుల అందిస్తున్న సేవలపై అపోహలు పెట్టుకోవద్దని, రోగుల ఆరోగ్య సంక్షేమమే వైద్యుల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్స్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ఆర్ఎంపీ అధ్యక్షుడు రాజగోపాల చారి, వైద్యులు శ్రీధర్, నవీన్ ఉన్నారు.

●జగిత్యాల జిల్లా కేంద్రంలోని టౌన్ హాలులో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించగా మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ప్రారంభించారు. 450 మందికి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రతినిదులు ప్రకాష్, వినోద్‌కుమార్, సుదర్శన్, సురేష్ కుమార్, శంకర్, గంగాధర్, దేవదాస్, అభిలాష్ ఉన్నారు.

కోరుట్ల : ప్రపంచ డాక్టర్స్ డే వేడుకలను పట్టణంలోని లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ మహిళ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులను సన్మానించి అభినందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు, కోటి నవదుర్గ మహిళ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. సేవా కార్యక్రమంలో వైద్యుల సేవచాలా గొప్పదన్నారు. ఈ సందర్భంగా వైద్యులు అనూప్‌రావు, దిలీప్ రావు, మనోజ్, రేగోండ రాజేష్, అన్వేష్, బడ్నాల నరేష్, అడెపూ అనురాగ్, స్వేతి అనూప్, అనూరాధలను సన్మానించి అభినందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు కుందారపు మహేందర్, పోతని ప్రవీణ్ కుమార్, అల్లాడి ప్రవీణ్, అడెపు మధు - కమల, కొండబత్తిని కృష్ణ, గుంటుక మహేష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి : పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిల్లో జాతీయ డాక్టర్స్ డే వేడుకలను నాయకులు ఘనంగా జరిపారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మెట్‌పల్లి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు వెంకట్‌రెడ్డి, గంగాసాగర్, సాగర్‌పటేల్, సంధ్యాపటేల్, గాజా రమేష్, ఆనంద్‌బాబు దంపతులను కాంగ్రెస్, బీఆర్ఎస్, మున్నూరుకాపు సంఘాల నాయకులు శాలువలతో సన్మానించారు.

వైద్యులను సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మెట్‌పల్లి మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఆర్ఎంపీ, పీఎంపీ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజమల్లయ్య, లింగం, శంకర్, నగేష్ న్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, పోస్టల్ వర్కర్స్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు శ్రీకాంత్, రాజ్‌కుమార్, ఆఫ్రిన్, రామకృష్ణ, బస్తీ దావాఖానలో డాక్టర్ వివేక్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పోస్ట్ మాస్టర్ వాజిత్‌ఖాన్, ఎండీ అజ్మత్, రమేష్, వినోద్, అభి, రమేష్, తాజొద్దీన్‌ను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వైద్య రంగంలో, పోస్టల్ రంగంలో సేవలు అందిస్తున్న వారి సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు నర్సయ్య, చార్టర్డ్ ప్రెసిడెంట్ రవీందర్, సెక్రటరీ రమేష్, ట్రెజరరీ రాజన్న, జడ్‌సీ డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యులు రవి, శశికాంత్ రెడ్డి, ఉదయ్ కుమార్, వాణి, రజితలను ఘనంగా సన్మానించారు. వైద్యులు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయికల్ లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మాజీ జడ్‌సీ కాటిపెల్లి రాం రెడ్డి, మాజీ డీసీలు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, అధ్యక్షుడు మచ్చ శేఖర్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న నాయకులు



వైద్యులను సన్మానిస్తున్న మహిళ క్లబ్ సభ్యులు



మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

ఎస్పీ అశోక్‌కుమార్

మెట్‌పల్లి, జూలై, 1 : ప్రజలకు ఎల్లవుడు అందుబాటులో ఉండి వచ్చిన ఫిర్యాదులో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్‌హెచ్‌వో, రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్‌లు, పట్టుకున్న వాహనాలు, రికార్డులను పరిశీలించి, సిబ్బంది వివరాలు, స్టేషన్‌లోని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు ఎస్సై చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. డయల్ 100కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని, బ్లూ కోల్ట్స్, పెట్రోల్ కారు 24 గంటలు గస్తీ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి వాటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని పలు సూచనలు చేశారు. ఈయన వెంటా డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎసైలు చిరంజీవి, అనిల్, సిబ్బంది ఉన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఇబ్రహీంపట్నం: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎస్పీ అశోక్ కుమాన్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్, రిసెప్షన్, ఎస్‌హెచ్‌వో, లాక్ అప్ రూంలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దొంగతనలు జరుగకుండ పెట్రోలింగ్ పకడ్బందిగా నిర్వహించాలని అన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఎర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని అదే విధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలతో పాటు యువను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వర రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ అనిల్ ఉన్నారు.



మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లోని వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

రైతులకు రు. 17 కోట్ల పంట రుణాలు

కథలాపూర్, జూలై 1 : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలోని పలు గ్రామాల రైతులకు రు. 17 కోట్ల పంట రుణాలు అందించినట్టు మేనేజర్ వాసిరెడ్డి బాలాజీ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం బ్యాంక్ రు. 85 కోట్ల లావాదేవీలతో ఖాతాదారులకు సేవలం దిస్తున్నామని చెప్పారు. ఖాతాదారులకు తమ బ్యాంకులో రు. 76 కోట్ల డిపాజిట్లు చేశారన్నారు. గొర్రెలు, మేకలు, గేదెలు, ఇతరత్రా వ్యాపారాల నిర్వాహణకుగాను కోటి రూపాయల రుణాలు అందించగా ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఖాతాదారులు ఇన్సూరెన్స్ చేయించుకునేందుకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

డీఎస్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

కోరుట్ల, జూలై 1 : రాజసభ సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్‌కు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘన నివాళి అర్పించారు. పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో డీ శ్రీనివాస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడారు. డీ శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో కాంగ్రెస్ బలోపేతానికి ఎంతో కృషి చేసాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగ భూషణం, కాంగ్రెస్ నాయకులు మ్యాకల నర్సయ్య, చిటిమెల్లి రంజిత్, కొంత రాజం, మచ్చ కవిత, ఎలేటి మహిపాల్ రెడ్డి, శ్రీరాముల అమ రేందర్, ఎండి రిజ్వాన్, నేమూరి భూమయ్య, సోగ్రబీ, చింత రూపాలత, చింత రూపాలత, చింత అశోక్ చిట్యాల లక్ష్మీనారాయణ, ఎలేశెట్టి గంగారెడ్డి, పసుల గంగారెడ్డి, పసుల కృష్ణ ప్రసాద్, తెడ్డు విజయ్, ముల్కు ప్రసాద్, ఎండి జబ్బార్, ఎండి యాకుబ్, కటకం దివాకర్, గడెల అశోక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



డీఎస్‌కు నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంగన్‌వాడీ పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమాదిబేగం

మెట్‌పల్లి రూరల్, జూలై, 1 : ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమాది బేగం అన్నారు. సోమవారం మండలంలోని పాటిమీదితండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారుల బరువు, ఎత్తుల మేళా కార్యక్రమాన్ని నిర్వహించి మ హిళలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న చిన్నారులకు కేంద్రాల ద్వారా బాలామృతం ఫ్లస్ అందించడం జరుగుతుందన్నారు. దీనిని తమ పిల్లలకు తినిపించడం వలన పోషణ స్థాయి మెరుగుపడుతుందన్నారు. కేంద్రాలకు తమ చిన్నారులను పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ ప్రమీల, ఆయా, మహిళలు, పాల్గొన్నారు.

మీ సహకారం వెలకట్టలేనిది

● బుగ్గారం ఎంపీపీ బాదినేని రాజమణి

బుగ్గారం జూలై 1: బుగ్గారం మండల అధికారులు, ప్రజాప్ర తినిధులు మండల అభివృద్ధిలో అందించిన సహకారం వెలకట్టలేనిద ని ఎంపీపీ బాదినేని రాజమణి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళంలో జడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీపీ బాదినేని రాజమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి బుగ్గారం మండ లాన్ని అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. నాడు నియోజకవర్గం ఉన్నప్పుడు ఏలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుంటామని అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ పదవి కాలం ముగుస్తుండటంతో వారికి స్థానిక నాయకులు, అధికారులు శాలువతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ రహమన్, మద్దునూర్ ఎంపీటీసీ గాలిపల్లి మహేష్ పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయాలు తెలపాలి

జిల్లా వ్యవసాయాధికారి వాణి

రాయికల్, జూలై 1: రైతు భరోసా పథకంపై రైతులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. రాయికల్ పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని ఉప్పుమడుగు, అల్లీపూర్ గ్రామాల్లో సోమవారం రైతుబంధు సమన్వయ సమావేశాలు సహకార సంఘాల్లో నిర్వహించారు. ఈ సమావేశాలకు హాజరైన జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఈ నెల 4వ తేదీ వరకు సహకార సంఘాల కార్యాలయాల ఆవరణలో రైతులతో సమావేశాలు నిర్వహించి రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరించనున్నట్లు తెలిపారు. చాలా వరకు రైతులు ఐదు నుంచి పదెకరాలు ఉన్నవారికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని తమ అభిప్రాయాలు చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, అల్లీపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, ఆలూరు సింగిల్ విండో చైర్మన్ దీటి రాజరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్‌లు, సీఈవోలు, ఇన్‌ఛార్జి సీఈవో పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : రైతు బందు పథకంపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని సోమవారం సహకార సంఘ అధికారులు చేపట్టారు. మండలంలోని అయలాపూర్, ఎఖీన్‌పూర్, కోరుట్ల సహకార సంఘాలలో డీసీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వంకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఖీన్‌పూర్, అయిలాపూర్, కోరుట్ల సింగిల్ విండో చైర్మన్లు నర్సారెడ్డి, నర్సారెడ్డి, భూంరెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి: రైతు బంధు రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణకు గాను సోమవారం పెగడపల్లి మండలంలోని నంచర్ల, పెగడపల్లి సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. సర్వసభ్యసమావేశంలో రైతు భరోసా ఏ రైతులకు, ఎన్ని ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు అందించాలి, తదితర అంశాలపై చర్చించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి-

సంక్షిప్త సమాచారం

గొల్లపల్లి : పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా నియమితులైన సంఘం కార్యవర్గ సభ్యులు అన్నారు. ఈ మేరకు గొల్లపెల్లి మండల అగ్గిమల్ల గ్రామ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యుల సమక్షంలో ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గూడూరి లక్ష్మి కాంతం, కార్యదర్శిగా ఎన్నం అశోక్, ఉపాధ్యాక్షులుగా ఎనగందుల రాములు, కోశాధికారిగా ఎనగందుల రాజేశం, గౌరవ అధ్యక్షులుగా లవణ్, అధికార ప్రతినిధిగా గూడ లక్ష్మీనారయణలు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కథలాపూర్ : వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో రోగాలు విజృంభించే అవకాశం ఉన్నందు వల్ల పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక దృష్టి సారించాలని లేనిచో చర్యలు తీసుకుంటామని ఎంపీవో ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని చింతకుంట, సిరికొండ, తాండ్ర్యాల గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన మట్టి తొలగించి, గుంతల్లో నీరు నిల్వ ఉంచకుండా చూడాలన్నారు. ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లి రోగాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. చింతకుంట, సిరికొండ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

మెట్‌పల్లి రూరల్ : వైద్యం అంటే ఓ వృత్తిగా కాకుండా ప్రజలను బతికించే ఓ శక్తిగా సేవ చేస్తున్న వైద్యులు దేవుడితో సమానమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ అంజిత్‌రెడ్డి, వాణి రెడ్డిలను శాలవలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనిరేకుల రమేష్‌యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది నెలలుగా ఎంపీటీసీలకు అందని వేతనం

కొడిమ్యాల, జూలై 1 : మండలంలోని ఎంపీటీసీలకు గత ఎని మిది నెలలుగా గౌరవ భృతి అందక పోవటంతో పలువురు ఎంపీ టీసీలు ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 3నపదవీ కాలం ముగియనుందని పేరు చెప్పటానికి నిరాకరించిన ఎంపీటీసీ తెలిపారు. ప్రతి నెలకు ప్రభుత్వం ఎంపీటీసీలకు అందించే గౌరవ వేతనం 6500 రూపాయలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు కోరుతున్నారు. పదవి ఉన్నప్పుడు అందని గౌరవ వేతనం పదవీ కాలం పూర్తయిన తర్వాతనైన చేతికి అందుతుందో లేదోనని ఆవేదన చెందుతున్నారు.

చెగ్యాం ముంపు బాధితులకు పరిహారం అందించాలి

● కలెక్టర్‌కు విప్ అడ్లూరి వినతి

వెల్గటూర్, జూలై 1: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామమైన చెగ్యాం ముంపు బాధితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందజేసి ఆదుకోవాలని సోమవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వినతి పత్రం సమర్పించారు. చెగ్యాంలో తమ ఇళ్లు, స్థలాలు కోల్పోయినప్పటికీ పూర్తి స్థాయి పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నారని వారికి సాధ్యమైనంత త్వరలో పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, చెన్న పున్నం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల టౌన్, జూలై 1 : పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్, చింతకుంట, గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో చైర్ పర్సన్ పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా మురికి నీరు నిలువకుంగా చూడాలని శానిటేషన్ అధికా రులకు సూచించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గాను ఇక నుంచి ప్రతి మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు ఉన్నారు.

రేపు మండల సమావేశం

కొడిమ్యాల, జూలై 1: మండల పరిషత్ కార్యాల యంలో ఈనెల 3న మండల సర్వ సభ్య సమావేశం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. మండలంలోని వివి గ్రామాల ఎంపీటీసీలు, వివిద శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.